క్లుప్తంగా

ఆరు నామినేషన్ల దాఖలు

ఖమ్మం లీగల్: వచ్చే నెల 2న న్యాయవాద సహకార సొసైటీలోని నాలుగు డైరెక్టర్ల స్థానాలకు నిర్వహించే ఎన్నికలకు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 25న పరిశీలన అనంతరం తుదిజాబితాను ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారి జి.రమేష్ తెలిపారు. ఈ పదవులకు ఆవుల అనురాధ, షేక్ నజరీన్, వల్లపు లింగయ్య, కొలకలూరి ప్రసాద్, కాసర రాజశేఖర్‌రెడ్డి, పాలవెల్లి వెంకటేశ్వర్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన



భరతనాట్యం చేస్తున్న నిధిశ్రీనందన

ఖమ్మం సహకారనగర్: నగరానికి చెందిన కై రలీ అకాడమీ వార్షికోత్సవ వేడుకలు గురువారం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల సంగీత, భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇందులో భరతనాట్య ప్రదర్శన ఇచ్చిన హార్వెస్ట్ టెండర్ రూట్స్ పాఠశాల విద్యార్థిని రాచకొండ నిధిశ్రీనందనను పలువురు అభినందించారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు సమీపాన వ్యవసాయ భూమిలో రాళ్ల బ్లాస్టింగ్ చేసేందుకు సమకూర్చుకున్న పేలుడు పదార్థాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పిండిప్రోలుకి చెందిన రూపని శ్రీనివాస్ వ్యవసాయక్షేత్రంలో బండల బ్లాస్టింగ్ కోసం పేలుడు పదార్థాలు తెప్పించారనే సమాచారంతో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నాలుగు డిటోనేటర్లు, ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోగా, స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

దరఖాస్తుల పరిశీలనకు నాలుగు బృందాలు



సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

నేలకొండపల్లి: భూ భారతి అమలుకు మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆయా సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కోసం నాలుగు బృందాలను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు. వివిధ మండలాలకు చెందిన డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌తో కూడిన ఈ బృందాలతో తహసీల్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి గురువారం సమావేశమై దరఖాస్తుల పరిశీలన, విచారణపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ ఇమ్రాన్, ఆర్‌ఐలు ఆలస్యం మధుసూదన్ రావు, అల్లం రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, నాలుగు బృందాలకు ఏన్కూరు, ముదిగొండ కలెక్టరేట్, మధిర డీటీలు జి.కిరణ్‌కుమార్, శ్రీలక్ష్మి, టి.కరుణాకర్‌రెడ్డి, దావీద్ కుమార్ నేతృత్వం వహిస్తారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఒడెలా
వినోద	జింఖానా, మ్యాడ్‌స్క్వేర్
సాయిరాం	సారంగపాణి జాతకం
ఆదిత్య	అర్జున్, వైజయంతి
శ్రీనివాస	సూర్యపేట జంక్షన్, జాక్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	38		20
కాకర	46	చుక్కకూర	4
బీట్‌రూట్	20		20
బీర	50	తోటకూర	4
దొండ	16		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	90		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	30		20
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

ఎవరి పని వారిదే..

'సుడా'పై పట్టింపు కరువు

- ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టించడంలో వెనుకబాటు
- 20,747 దరఖాస్తులకు 5,180 మందే చెల్లింపు
- నామమాత్రంగానే ఫీజుల వసూలు
- చోద్యం చూస్తున్న అధికారులు



కేఎంసీ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ వద్ద దరఖాస్తుదారులు

ఖమ్మంమయూరిసెంటర్: లేఔట్ రెగ్యులరైజ్ స్కీం ద్వారా జిల్లా నుంచి ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తీసుకొచ్చే కార్యాలయాల్లో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ (సుడా) ఒకటి. 2020 ఏడాదిలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ తర్వాత ఆ స్థాయిలో దరఖాస్తులు వచ్చింది సుడాకు మాత్రమే. కేఎంసీకి 40వేల దరఖాస్తులు వస్తే, సుడాకు 20,747 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుదారులంతా ఫీజులు చెల్లిస్తే సుడా ద్వారా ప్రభుత్వానికి భారీగానే ఆదాయం వస్తుంది. అయితే సుడా అధికారులు అలసత్వంతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల చెల్లింపు ప్రక్రియ నత్తనడకన సాగుతుందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటి వరకు సుడా పరిధిలో 5,180 మంది దరఖాస్తుదారులు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించగా.. రూ.13.15 కోట్లు ఆదాయం వచ్చింది.

తీవ్ర నిర్లక్ష్యం..

దరఖాస్తుదారులతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టించడంలో సుడా అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సిబ్బంది కొరతను సాకుగా చూపి అధికారులు ఈ ప్రక్రియను పూర్తిగా వదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు 2020లో రూ.1,000 రుసుము చెల్లించిన వారిని సంప్రదించి, వారితో ఫీజులు చెల్లించేలా చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 19,245 మందికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించాలని వారి మొబైల్ ఫోన్లకు సమాచారం పంపించిన అధికారులు.. ఆ తర్వాత వారు ఫీజులు చెల్లించేలా కనీస అవగాహన కల్పించడంలేదని తెలుస్తోంది. ఇక కేఎంసీ కార్యాలయానికి వచ్చిన వారికి మాత్రం సమాధానాలు చెప్పి తిప్పి పంపిస్తున్న సుడా అధికారులు.. వారికి ప్రొసీడింగ్స్ ఎప్పుడు అందుతాయో చెప్పే పరిస్థితి లేదు. కేఎంసీతో పోలిస్తే సుడా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు వసూలు చేయడంలో పూర్తిగా వెనుకపడిపోయిందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం 25 శాతం రాయితీ గడువు పొడిగించినా.. దానిని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు ఎక్కడా చర్యలు చేపట్టినట్లు లేదని తెలుస్తోంది.

సుడా పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు..

మొత్తం దరఖాస్తులు	20,747
ఫీజు సమాచారం ఇచ్చినవి	19,245
ఫీజు చెల్లించిన దరఖాస్తులు	5,180
ప్రొసీడింగ్స్ జారీ చేసినవి	735
ఇప్పటి వరకు వసూలైన ఫీజు	రూ.13.40 కోట్లు

సిబ్బంది కొరత..

సుడా విస్తీర్ణం భారీగా ఉన్నా.. ఆ స్థాయిలో అధికారులు, సిబ్బంది లేరు. ఉన్న అధికారుల్లో ఒకరిద్దరు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించేందుకు కేఎంసీకి వచ్చే వారికి సూచనలు చేసేందుకు కౌంటర్లలో కూర్చుంటుంటే.. మిగిలిన వారిలో ఒకరిద్దరు ఇతర పనులను సాకుగా చూపి ఈ ప్రక్రియకు దూరంగా ఉంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు వసూలు చేయడంతో పోలిస్తే ఇతర అనుమతులు జారీ చేయడంపైనే సదరు అధికారులు దృష్టిసారించారన్న చర్చ కేఎంసీలో జరుగుతోంది. ఇప్పటికైనా సుడా అధికారుల ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టి సారించకపోతే దరఖాస్తుదారులు 25 శాతం రాయితీని కోల్పోతారనే చర్చ ఉంది.

రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: తెలంగాణను అన్నపూర్ణ రాష్ట్రంగా మార్చడం కోసం, రైతుల సంక్షేమానికి నిరంతరం ఆలోచించే రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి అని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం కామేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం దొరకుతుందని, పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు గుగులోత్ గబ్రూనాయక్, మాలోత్ బాన్‌సింగ్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవి, ఆర్‌ఐ సక్రు, ఏఈఓ శ్రీకన్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల తీరుపై రైతుల మండిపాటు

నేలకొండపల్లి: మండలంలోని ఓ రైస్ మిల్లుకు కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి కాంటాలు వేసిన ధాన్యం బస్తాలను తీసుకొచ్చారు. గత మూడు రోజుల క్రితం మిల్లు వద్దకు దాదాపు 15 ట్రాక్టర్ల ధాన్యం రాగా.. రేపుమాపు దించుకుంటామని మిల్లర్లు చెప్పడంతో మిల్లు వద్దే రైతులు పడిగాపులు కాచారు. తీరా సమయం దాటటంతో సహనం కోల్పోయిన రైతులు గురువారం మిల్లర్లను నిలదీశారు. దీంతో మిల్లర్లు రైతులతో వాగ్వాదం చేస్తూ మా మిల్లు.. మా ఇష్టం.. రాత్రి దించుకుందామని అనుకున్న కానీ ఇప్పుడు తాము దించుకునేది లేదని, మిల్లు టార్గెట్ అయిందని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ రుబాబు చేస్తున్నారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సమాచారం ఇవ్వగా.. జిల్లా అధికారులతో చర్చించి దిగుమతి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు మిల్లు వద్ద జాగారం చేస్తున్నారు. మిల్లర్లపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పహల్గాం దాడి మాయని మచ్చ



ఖమ్మంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

- **ఖమ్మంమామిళ్లగూడెం:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులతో పాటు, హిందువులపై జరిపిన దాడి మానవత్వానికి మాయని మచ్చ అని జామియత్ ఉలేమా ఏ హింద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మౌలానా మహమ్మద్ సయీద్ అహ్మద్‌ఖాస్మీ, ముఫ్తీ జలాలుద్దీన్‌లతో పాటు బీజేపీ నాయకుడు తాండ్ర వినోదరావు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. అమాయకపౌరులను హతమార్చడం దారుణమని, జరిగిన మారణ హోమంతో దేశం తల్లడిల్లుతుంటే మరోవైపు కొందరు దీన్ని మతం రంగు పూయడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఇస్లాం వ్యవస్థ ఇలాంటి చర్యలను ఏ మాత్రం ప్రోత్సహించదని, ఉగ్రవాదులకు మతం ఉండదని స్పష్టం చేశారు. ఇలాంటి ఘాతుకానికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

- **ఖమ్మం సహకారనగర్:** అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం సమీపంలోని బైసరన్ వద్ద జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతులకు సంతాపంగా గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరావులు తెలిపారు. సంఘం కార్యాలయం నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నాయకులు నాగమల్లేశ్వరరావు, వెంకన్న, షమీ, రాంబాబు, పద్మ ,సురేష్, నాగేశ్వరరావు, ప్రసాద్, రమణ ,ఉద్దండు, శ్రీనివాసరావు,

మృతులకు నివాళి..



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

- **ఖమ్మంఅర్బన్:** కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నగరంలోని 8వ డివిజన్ గోపాలపురం యువత ఆధ్వర్యాన గురువారం రాత్రి అశ్రు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూక్యా అశోక్, రవి, ఫణి, లక్ష్మణ్, శ్రీను, చంటి, రెహమాన్, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: జెడ్పీ జీపీఎఫ్ స్లిప్పులు, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్స్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓనాగపద్మజకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి నిలిపివేసిన స్లిప్పులను, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ.వీ. నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, సురేష్, షేక్ ఉద్దండ్ షరీఫ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

జలబిందెలతో ప్రదర్శన



అభిషేకం చేస్తున్న భక్తులు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి దేవాలయంలో గంగమ్మ తల్లి, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా శుక్రవారం గ్రామంలో జలబిందెలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. విగ్రహాలను ఆటపాటలతో సందడిగా తీసుకొచ్చి బలిహరణ, పూజా కార్యక్రమాలు జరిపారు. అర్చకులు జొన్నభట్ల ప్రసాద్‌శాస్త్రి, మాజీ సర్పంచ్ కనకబండి సీతారాములు, సంఘం అధ్యక్షుడు కనకబండి రమేష్, బాలిన నారాయణ, గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు మల్లెబోయిన ఉపేందర్, సత్యనారాయణ, కనకనాగరాజు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సత్కారం..



సాయికుమార్‌ను సత్కరించిన పువ్వాళ్ల, రాయల

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయం సాధించిన వేజెళ్ల సాయికుమార్‌ను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు గురువారం పార్టీ కార్యాలయంలో అభినందించారు. మర్యాదపూర్వకంగా వారిని కలిసిన సాయికుమార్‌కు శాలువా కప్పి సత్కరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కన్వీనర్ చెన్నారావు, జెర్రిపోతుల అంజనీకుమార్, ఇజ్జగాని సత్యం, రామకృష్ణ, షఫి, క్రాంతి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పండ్ల మార్కెట్‌ను వినియోగించుకోవాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పండ్ల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవ్యవసాయం: రైతులు, వినియోగదారులు మామిడి పండ్ల మార్కెట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఖమ్మం రోటరీనగర్‌లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మామిడి పండ్ల మార్కెట్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రాంగణంలో 35మంది రైతులు నేరుగా కార్బైడ్ రహితంగా పండించిన మామిడి అమ్ముకునే వీలుందని తెలిపారు. ఇదే ప్రాంగణంలో సీజన్ల వారీగా పండ్ల విక్రయానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, కార్పొరేటర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు, ఎల్ఈడీ సోలార్ లైట్ అందజేస్తున్న కలెక్టర్

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో వీధి వ్యాపారాలు చేసే మహిళల ఆర్థికాభివృద్ధికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో మెప్మా అధికారులు రుణాలు మంజూరు చేయించారు. ఎస్‌బీఐ రోటరీనగర్ బ్రాంచ్ ద్వారా తోపుడు బండ్ల కోసం మహిళలకు రూ.25 వేల చొప్పున బ్యాంక్ రుణం మంజూరు చేయగా.. చెక్కులను కలెక్టర్ గురువారం అందజేశారు. అలాగే, బ్యాంక్ వారి సహకారంతో మెప్మా అధికారులు రూ.7వేల విలువ చేసే ఎల్ఈడీ సోలార్ లైట్లు కూడా పంపిణీ చేశారు. టీఎంసీ గుడిపూడి సుజాత, రోటరీనగర్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై నిర్లక్ష్యం వద్దు

- **కామేపల్లి:** ఈజీఎస్ ద్వారా ప్రతి గ్రామంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ చలపతిరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, చేసిన పని తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీల హాజరు నమోదు చేసుకుని, కొలతల ప్రకారం రూ.307 కూలి వచ్చేలా చూడాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు పనికి సంబంధించిన కొలతలు తీసుకొని కంప్యూటర్ ఆపరేటర్లకు అందించాలన్నారు. అదే విధంగా నర్సరీల్లో ప్రతీ మొక్క బతికే చూడాలని, నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, ఈసీ వెంకటేశ్వరరావు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

- **నేలకొండపల్లి:** ఉపాధి హామీ పనిదినాలను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ జి.నాగేంద్ర సూచించారు. మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో గురువారం ఉపాధి పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులను కొలతలు ప్రకారం చేయాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి క్షేత్రసహాయకుడు తిగుళ్ల భాస్కర్, వడ్లమూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, మేట్‌లు పాకనాటి సీతారామిరెడ్డి, కర్ల బాలస్వామి, బిందె ముత్తయ్య, ఆనం వెంకటరెడ్డి, చింతమళ్ల యశోద, వుల్లోజి రమ, చింతమళ్ల వెంకటరమణ, చంద్రయ్య, సుశీల, సునీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కామేపల్లి: సమావేశంలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఏపీడీ చలపతిరావు

వృద్ధురాలికి శస్త్రచికిత్స, కణితి తొలగింపు

ఖమ్మంఅర్బన్: కడుపు నొప్పితో బాధపడుతున్న 75ఏళ్ల వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స ద్వారా కణితి తొలగించామని ఖమ్మంలోని మమత వైద్య విద్యాసంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్ తెలిపారు. మమత జనరల్ ఆస్పత్రిలో డీన్ అనురాధ, సూపరింటెండెంట్ రామస్వామి, గైనకాలజీ హెచ్‌ఓడీ నైమిషాతో కలిసి గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా రంగాపురానికి చెందిన వృద్ధురాలు పి.సుశీల కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి రాగా, పరీక్షల అనంతరం అండాశయంలో కణితి(నీటి బుడగ) ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో ఆరోగ్యశ్రీద్వారా శస్త్రచికిత్స నిర్వహించి సుమారు ఏడు కిలోల కణితిని తొలగించగా, ప్రస్తుతం ఆమె కోలుకుందని తెలిపారు. హెచ్‌ఓడీ నైమిషా, వైద్యులు ఇందు, వార్షిక, గీత, అనస్తీషియా హెచ్‌ఓడీ కిరణ్ కుమార్, శశాంక బృందం ఆధ్వర్యాన చికిత్స చేసినట్లు వెల్లడించారు.



వైద్యులకు కృతజ్ఞతలు చెబుతున్న సుశీల

కార్మికుల రక్తం నుంచి ఉద్భవించిందే ఎర్రజెండా

ఖమ్మం మామిళ్లగూడెం: మేడే సందర్భంగా జిల్లాలోని అన్ని కార్మిక వాడల్లో ఎర్రజెండాలను ఎగరేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగూర్ నరసింహారావు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజువారి పని గంటల కోసం మొదలైన పోరాటంలో కార్మికుల రక్తం నుంచి ఉద్భవించిందే ఎర్రజెండా అన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బీ.జీ.క్లెమెంట్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పేరబోయిన మోహన్‌రావు, పిల్లి రమేష్, సహాయ కార్యదర్శులు చెరుకూరి వెంకటేశ్వరరావు, ఎండీ జాకీరుద్దీన్, మహదేవ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీ ప్లాస్టిక్‌మయం..!



డ్రెయినేజీల్లో మురుగు తొలగించేవారు లేకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతున్నాయి. నగరంలోని కొత్త బస్టాండ్ నుంచి డీఆర్‌డీఏ రోడ్డుకు వెళ్లే మార్గంలో బుర్హాన్‌పురం ప్రధాన డ్రెయినేజీలో వ్యర్థాలు, ప్లాస్టిక్ సీసాలు, సంచులు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని, ఫిర్యాదులు చేస్తే పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. - ఖమ్మంమయూరిసెంటర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఎం.సాంబయ్య, శానిటరీ సూపర్‌వైజర్, కేఎంసీ
సెల్ నంబర్ : 94946 50386